క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేస్తున్న అభిమానులు

భీమునిపట్నం: భీమిలి చిరంజీవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోగులకు పండ్లు, రొట్టెలు, అలాగే మెయిన్‌రోడ్డు గంటస్తంభం వద్ద పేదలకు పులిహోర పంపిణీ చేశారు. గంటా నూకరాజు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, సత్తరపు బాబురావు, ఎచ్చర్ల హరి, మొకర నర్సింగరావు, మరోజు సంజీవరావు, ఎర్నింటి అచ్చిబాబు, డింగి దుర్గారెడ్డి, కంచర్ల కామేష్, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన ర్యాలీలో విద్యార్థులు

భీమునిపట్నం: కోల్‌కతా మెడికో హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భీమిలి ప్రభుత్వ జూనియర్‌కళాశాల విద్యార్థులు, అంతర్జాతీయ మానవ హక్కుల సేవా మండలి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మానవ హక్కుల కమిటీ కార్యదర్శి భాగం స్వాతి సుధాకర్ మాట్లాడుతూ మెడికో హత్య దారుణమన్నారు. ఇంతటి ఘోరానికి పాల్పడ్డవారిని తీవ్రంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.రాజ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ పిల్లల్ని బయటకు పంపాలంటే భయపడే విధంగా వరుస సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు వెంకట రమణ, చిల్ల ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

శిలాఫలకం శిథిలాలు తొలగించండి



సంతపేటలో ధ్వంసమైన శిలాఫలకం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేటలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఇరవై రోజుల క్రితం సెప్టిక్ క్లీనర్ వాహనం ఢీకొట్టింది. దీంతో శిలాఫలకంతో పాటు దిమ్మె ముక్కలై పడిపోయింది. అప్పటి నుంచి జీవీఎంసీ అధికారులు దీని గురించి పట్టించుకోలేదు. శిలాఫలకాన్ని పునరుద్ధరించకపోయినా రోడ్డు పక్క పడి ఉన్న శిథిలాలను తొలగించలేదు. ఇప్పటికీ రెండుసార్లు జెడ్సీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పలువురు పేర్కొన్నారు.

పబ్లిక్‌బోరు ధ్వంసం



కబ్జాదారులు ధ్వంసం చేసిన బోరుబావి

తగరపువలస: ఆనందపురం మండలం బంటుపల్లి వారి కళ్లాల పంచాయతీ చందకవారి కళ్లాలలో పబ్లిక్ బోరుపై కబ్జాదారుల కళ్లు పడ్డాయి. అంతే బోరుబావిని మొదలు వరకు ధ్వంసం చేశారు. తరువాత దానిని కబ్జా చేసి చుట్టూ గోడ కట్టడానికి ప్రయత్నించారు. దీంతో స్థానికులు గుర్తించి బోరుబావి స్థలం ఆక్రమణకు అడ్డు తగిలారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ తనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప తానేమీ చేయలేనని కార్యదర్శి చేతులెత్తేశాడు. అత్యవసర పరిస్థితులలో తాగునీటి అవసరాలను తీర్చే బోరుబావిని అక్రమార్కులు ధ్వంసం చేయడం తగదని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పార్కు లాన్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు



దెబ్బతిన్న కళాఖండం బొమ్మ



వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన చెట్లు

మిథ్యావనాలు

- కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన పార్కులో ఆహ్లాదం కరువు
- స్వతంత్రనగర్ పార్కు నిర్వహణ గాలికి వదిలేసిన వైనం
- గత ప్రభుత్వం హయాంలో రూ.2.50కోట్లతో ఏర్పాటు



నిర్వహణ గాలికి వదిలేసిన స్వతంత్రనగర్‌లోని జీవీఎంసీ పెద్ద పార్కు



దెబ్బ తిన్న ఫ్లోరింగ్



గేటుకు తాళం వేసి ఉన్న పార్కు ప్రధాన గేటు

మధురవాడ: కనీసం ఆనవాళ్లు, హద్దులు కూడా సక్రమంగా లేకుండా చాలా ఏళ్లుగా వదిలేసిన పార్కులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిరక్షించి వాటి అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించింది. వీటిని ఆహ్లాదానికి, ఆనందానికి నిలయాలుగా తయారు చేసి అందుబాటులోకి తెస్తే నేటి కూటమి ప్రభుత్వం వీటిని గాలికి వదిలేస్తోంది. కనీసం నిర్వహణ పనులు కూడా సక్రమంగా చేపట్టక పోవడంతో ఆహ్లాదం, ఆనందం మాట అటు ఉంచితే అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలకు అడ్డాగా మారాయి. ఇలాంటి వాటిల్లో స్వతంత్రనగర్‌లోని పెద్ద పార్కు ఒక్కటి. దీనిని గత ప్రభుత్వం రూ.2.50కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసి ఫిబ్రవరిలో అందుబాటులోకి తీసువచ్చింది. దీనికి సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణ పనులు కూడా చేయించేవారు. ఎన్నికలు అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పార్కుపై నిర్లక్ష్యం చూపుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏ మంచి పనులను కూడా ప్రజలకు దరిచేరకుండా చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. దీంతో పార్కు నిర్వహణ గాలికి వదిలేసింది. కనీసం ప్రధాన గేటు తెరిచి, రక్షణ పనులు చేపట్టే సిబ్బంది కూడా కరువయ్యారు. పార్కులో నిర్వహణ పనులు చేపట్టడం లేదని, లైటింగ్, రక్షణ చర్యలు లేవని పలువురు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ స్పందించడం లేదు. దీంతో ఈ పార్కు అస్తవ్యస్తంగా, సమస్యలు నిలయంగా మారింది.

ఇవీ సమస్యలు

- లైటింగ్ సక్రమంగా లేక పోవడంతో రక్షణ కరువయ్యింది.
- ఆకతాయిలు, మందుల బాబులకు అడ్డాగా మారింది.
- కనీసం ప్రధాన గేటు కూడా తెరచి రక్షణ కల్పించే వ్యవస్థ లేదు.



తాళం వేసి ఉన్న మారుగు దొడ్లు

- మరుగుదొడ్లు నిర్వహణ జరుగక తాళాలు వేసి ఉంచుతున్నారు.
- కళాఖండాలు, అందం కోసం ఏర్పాటు చేసిన సామగ్రి శిథిలమైంది
- కొన్ని చోట్ల ఫ్లోరింగ్, లైటింగ్ పోల్స్ కూడా దెబ్బ తిన్నాయి.
- వాకింగ్ ట్రాక్‌లు నిర్వహణ లేక ట్రాక్‌ల్లోకి పిచ్చి మొక్కలు, చెట్లు కొమ్మలతో నడవటానికి వీలులేకుండా ఉంది.
- పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశాలు, లాన్‌లలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి సుందర ప్రదేశాలు అస్తవ్యస్తంగా మారాయి.

అంచనాలు సిద్ధం

పార్కులో కొన్ని సమస్యలు ఉన్నాయని గుర్తించాం. లైటింగ్, ప్యాలన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. వాచ్‌మన్ అవసరాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారు. నిర్వహణ పనులకు అంచనాలు సిద్ధం చేశాం. త్వరలోనే పార్కు అందుబాటులోకి తెస్తాం.

–ఎస్. శ్రీనివాస్, ఏఈ, జీవీఎంసీ ఇంజనీరింగ్ శాఖ

ఆహ్లాదం పంచని పార్కులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పార్కుల నిర్వహణ గాలికి వదిలేశారు. తుప్పలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారిపోయాయి. పార్కులో సేదతీరేందుకు అనువైన వాతావరణం లేకపోవడంతో వీటి వినియోగం పక్కదారి పడుతోంది. దీంతో ఇవి ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయి. భీమిలి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 15 ఏళ్ల క్రితం సంతపేట సత్యనారాయణ కొండవాలు ప్రాంతంలో, గోస్తనీనది తీరంలో కొండపేట కొండమీద మరొక పార్కును ఏర్పాటు చేశారు. మొదట్లో ఈ పార్కులలో ఆహ్లాదకరమైన మొక్కలు వేసి సిమెంట్ బెంచీలు, లైటింగ్, కాలిబాటల నిర్మించారు. కొండపేట పార్కుకు రెండు వైపులా మెట్లమార్గం కూడా నిర్మించారు. 2010 తరువాత భీమిలి మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదు. దీంతో అప్పటి నుంచి వీటి ఆలనాపాలనా చూసేవారే లేకపోవడంతో ఈ రెండు చోట్లా సగం వరకు పార్కు స్థలాలు కబ్జాలకు గురయ్యాయి.

లక్ష్యం నెరవేరలేదు..

చుట్టూ ఇళ్ల మధ్య పార్కులు ఏర్పాటు చేయడం వలన సాయంత్రం వేళ చిన్నారులు ఆటలాడుకోవడానికి, వృద్ధులు పిచ్చాపాటి మాట్లాడుకోవడానికి మిగిలిన వర్గాల వారికి ఆహ్లాదం పొందడానికి లక్ష్యంగా పార్కులు ఏర్పాటు చేసేవారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కులకు కాపలాదారులు లేకపోవడం, చెట్లకు నీరుపోసేవారు కూడా కరువవడంతో సంతపేట, కొండపేటలో పార్కులు నిర్వీర్యం అయిపోయాయి. కొండపేట పార్కులో ఇటీవల ఆటవస్తువులు ఏర్పాటు చేసి పెయింటింగ్ పనులు చేపట్టినా సంతపేట పార్కులో ఎలాంటి వసతులు కల్పించలేదు. ముఖ్యంగా కొండపేట పార్కు చుట్టూ, మధ్యలో స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. జీవీఎంసీ పరిధిలో ఉన్న పార్కులకు ప్రహరీలు నిర్మించి ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు నిర్వహణ చేపట్టి స్థానికులకు ఆహ్లాదం, చిన్నారులకు ఆటవిడుపు కలిగించేలా వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నిర్వహణ లేక వెలవెలబోతున్న కొండపేట పార్కు

బాలికల సంక్షేమంపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏవీ శేషమ్మ

తగరపువలస: మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో భీమిలిలో నిర్వహిస్తున్న బాలసదన్‌ను గురువారం జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ఏవీ శేషమ్మ, భీమిలి జూనియర్ సివిల్ న్యాయస్థానం మెజిస్ట్రేట్ పి.నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులతో పాటు చిన్నారులతో మాట్లాడారు. బాలికలకు అందుతున్న వసతులు, ఆహారం, సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల హక్కులు, చట్టాల గురించి వివరించి న్యాయసలహాలు గురించి తెలియజేశారు.

డ్రైనేజీ శ్లాబు శిథిలం



డ్రైనేజీ శ్లాబుకు రంధ్రం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నుంచి కొండపేట పంప్‌హౌస్‌కు వెళ్లే రహదారిలో డ్రైనేజీపై శ్లాబు శిథిమైంది. కాంక్రీట్ విడిపోయిన ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు దీనిపై నుంచి నడిచి వెళ్లేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. శ్లాబు నాణ్యత లేనందున కొత్తగా డ్రైనేజీపై శ్లాబు నిర్మించాలని కొండపేట పంప్‌హౌస్ కాలనీ వాసులు కోరుతున్నారు.

25న లక్ష తులసి పూజ



కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన కుంతీ మాధవ స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తారు. ఉదయం ఆరు గంటలకు స్వామికి పంచామృత అభిషేకాలు జరుపుతారు. తొమ్మిది గంటలకు లక్ష తులసి పూజ నిర్వహిస్తారు. అనంతరం లక్ష్మీ దేవికి కుంకుమార్చన జరుపుతారు.

విపత్తుల నుంచి బయటపడడంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విపత్తు ప్రతిస్పందన దళం

పీఎంపాలెం: ప్రాణాంతక విపత్తులనుంచి తమను తాము రక్షించుకోవడంపై కొమ్మాది నవోదయ విద్యార్థులకు గురువారం విపత్తు ప్రతి స్పందన దళం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. బక్కన్నపాలెం 16వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వి.నారాయణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తుపాను సమయంలో భీభత్సం సృష్టించే పెనుగాలులు ,భవనాలు కూలిపోవడం, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు ఫ్యాక్టరీలలో కెమికల్ రియాక్షన్ వంటి విపత్తులు నుంచి తమకు తాను ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు వివరించారు. విపత్తుల సమయంలో అంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం పయోగించే పరికరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి.రామకృష్ణ, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



వెల్లంకి బీజేపీ కార్యాలయంలో హాజరైన నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ, గొట్టిపల్లి, గిడిజాల, లొడగలవానిపాలెం, శిర్లపాలెం గ్రామపంచాయతీలకు చెందిన వంద మంది గురువారం బీజేపీలో చేరారు. వెల్లంకి పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా ఇంచార్జ్ ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాలలో ముందుకు దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు, నియోజకవర్గ కో కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బండారు అనిల్‌కుమార్, లెంక శ్రీరామ్, తెడ్లాపు అప్పారావు, కె.వి.ఎస్.కృష్ణారావు, పి.చిన్నారావు, పోతిన జీవన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ పీఎస్‌లో సిబ్బంది కొరత

- పోలీసులపై పనిభారం
- అరకొర సిబ్బందితోనే అందుతున్న సేవలు
- కేసుల దర్యాప్తు పైనా ప్రభావం



ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారులు (ఫైల్)



ఎంవీపీ స్మార్ట్ పోలీస్ స్టేషన్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ శాంతిభద్రతల పోలీస్ స్టేషన్‌ను సిబ్బంది కొరత వెంటాడుతోంది. నగరంలో స్మార్ట్ పోలీస్ స్టేషన్‌గా పోలీస్ శాఖ ఎంవీపీ క్రైమ్, శాంతిభద్రతల స్టేషన్లను గతంలో అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ పోలీస్ స్టేషన్‌గా అభివృద్ధి చేయడంతో సాధారణంగానే ఇక్కడి సేవలపై నగర వ్యాప్తంగా ఆసక్తి ఉంది. అన్ని సౌకర్యాలతో ఈ స్టేషన్ అభివృద్ధికి పెద్దపీట వేసిన నగర పోలీస్ శాఖ అవసరమైన మేర సిబ్బంది నియామకాలు చేపట్టడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. తొలి నుంచి ఈ స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో నేర నియంత్రణ, దోషులను పట్టుకోవడం, కేసుల దర్యాప్తు, స్టేషన్ లిమిట్స్‌లో గస్తీ ప్రస్తుత సిబ్బందికి సవాలుగా మారుతున్నాయి.

ఒక్క ఎస్‌ఐతోనే నెట్టుకొస్తున్నారు..

వాస్తవానికి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో 4 నుంచి 5 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు(ఎస్‌ఐలు) ఉండాల్సి ఉంది. ప్రస్తుతం సీఐతోపాటు ఒక ఎస్ఐ(పురుషుడు) మాత్రమే ఉన్నారు. స్టేషన్‌లో మొత్తం 50 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ముగ్గురు ఏఎస్ఐలు, 8 మంది హెచ్‌సీలు కాగా.. మిగిలిన వారు కానిస్టేబుళ్లు. స్టేషన్ పరిధిలో గొడవలు, కుటుంబ కలహాలు, మిస్సింగ్ కేసులు అధికంగా ఉంటున్నాయి. దీంతో కేసుల దర్యాప్తు, కౌన్సెలింగ్స్ అధికంగా జరుగుతుండటంతో సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారు. అవసరం మేరకు ఎస్ఐ స్థాయి అధికారులు లేకపోవడంతో కేసుల దర్యాప్తు భారంగా మారుతోంది. కేసుల పురోగతి, నేరాల అదుపుపై ఎలాంటి సమీక్షలు లేకపోవడంతో నేర నియంత్రణపై ప్రభావం పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో నగరంలో కీలకమైన ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే పలువురు సూచిస్తున్నారు.

నాలుగు రోజులు కృష్ణాష్టమి వేడుకలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నాలుగు రోజుల పాటు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ వేడుకలు శనివారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ నాలుగు రోజులు శ్రీ కృష్ణుడికి ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, 26న కృష్ణాష్టమి సందర్భంగా వేకువ జామున మంగళ హారతి, దర్శన హారతి, అఖండ హరినామ సంకీర్తన నిర్వహించనున్నామని తెలిపారు.

శ్రీకృష్ణవేషధారణ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ డొకరపేట రామాలయంలో ఈ నెల 26న శ్రీకృష్ణవేషధారణ పోటీలు నిర్వహించనున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు వేషధారణ, 3 నుంచి 6 ఏళ్ల వయసు కలిగిన వారికి వేషధారణతో పాటు వచనం లేదా శ్లోకం, 6 నుంచి 9 ఏళ్ల లోపు చిన్నారులకు వేషధారణ, పద్యం, వచనం, శ్లోకం పోటీలు ఉంటాయి. ఈ పోటీలలో పాల్గొనాలనుకునేవారు శనివారంలోగా 99087 29298, 99856 11355 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అనధికార ఇసుక నిల్వలపై సమాచారమివ్వండి

తగరపువలస: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, భీమిలి స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అనధికారంగా ఇసుక నిల్వలు ఉన్నా , అక్రమంగా విక్రయించినా తమకు సమాచారం అందించాలని ఎస్ఐ పి.చిన్నంనాయుడు కోరారు. అనధికారంగా ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నందున తమతో సహకరించాలని కోరారు. వివరాలు 93474 71101 ద్వారా తెలియజేయాలన్నారు.

డిసెంబర్‌లో పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



ఎమ్మెల్యే గంటాతో పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడానికి సహకరిస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు (పూర్వ విద్యార్థులు) గురువారం గంటాను కలిశారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ పాఠశాల శతాబ్ది ఉత్సవాలను డిసెంబర్‌లో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఆహ్వానించనున్నామని, దీని సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కమిటీ సభ్యులు ఎంపీ పార్వతీశం, మైలిపల్లి లక్ష్మణరావు, కె.ముత్యాలరావు, మైలపల్లి షణ్ముఖరావు, చౌదరి సత్యారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నగంటి రమణ పాల్గొన్నారు.

కూడలిలో పువ్వుల వ్యాపారులతో ట్రాఫిక్ కష్టాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మార్కెట్‌ను ఆనుకుని కూడలిలో పువ్వుల వ్యాపారులు నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. విశాఖ, పెందుర్తి వైపు నుంచి వచ్చే వాహనాలు మార్కెట్ కూడలిలోని ఫ్లై ఓవర్ కింద నిలుపుతుంటారు. పాదచారులు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం ప్రయాణికులు వేచి చూసే అవకాశం లేకుండా పువ్వుల వ్యాపారులే ఫుట్‌పాత్‌లపైనా, కూడలిలోనూ విక్రయాలు జరుపుతుంటారు. వచ్చే ప్రతి వాహనాలను వెంబడించి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. దీంతో తరచూ ఈ కూడలిలో ఇబ్బందికరమైన వాతావరణం కనిపిస్తోంది. పువ్వుల వ్యాపారులకు ఈ ప్రాంతంలో ప్రత్యేక జోన్ కేటాయించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా పువ్వుల వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలో దుక్కవానిపాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్టమీదపాలెం, తర్లువాడ, నగరపాలెం, గుడిలోవ, పెద్దిపాలెం, పల్లిపేట, పొడుగుపాలెం, చందక, కుసులవాడ, జగన్నాధపురం , గొట్టిపల్లి, వెంకటాపురం గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ నగరంపాలెం 11కేవీ ఫీడర్ పై నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు గణేష్ నగర్, పోర్టుకాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, నగరంపాలెం పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



నగరంపాలెంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ: పశువులకు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డీడీ చంద్రశేఖర్ చెప్పారు. గురువారం మధురవాడ నగరంపాలెం గాలి కుంటు వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18వరకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 86 పశువులకు టీకాలు వేశారు. అలాగే బ్రూసిల్లోస్ వ్యాధి నివారణ టీకాలు కూడా నెల రోజులు పాటు వేస్తామని అధికారులు తెలిపారు. ఆర్ఏడీడీఎల్ వైద్యురాలు హిమజ, చంద్రంపాలెం డాక్టర్ అనుపమ పాల్గొన్నారు.